క్లుప్తంగా

4 వేల ఎకరాల్లో వరి పంట మునక


చెరుకుమిల్లి చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రదీప్‌కుమార్

గోపాలపురం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చెరువులు పూర్తిగా నిండి పోయినట్టు తహసీల్దార్ బి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు బుధవారం ఆయన వివిధ గ్రామాల్లోని చెరువులను పరిశీలించారు. దీనిపై కలెక్టర్ నివేదిక ఇస్తామని చెప్పారు. అలాగే మండలంలోని లోతట్టు ప్రాంతాలైన వెంకటాయపాలెం, చెరుకుమిల్లి, చిట్యాల గ్రామాల్లో సుమారు 4 వేల ఎకరాల్లోని వరి నీట మునిగినట్టు వెల్లడించారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం అంచనా వేస్తున్నట్టు చెప్పారు. చెరువులు నిండినా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ ప్రదీప్‌కుమార్ చెప్పారు.

నేడు ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరం

కొవ్వూరు: స్థానిక అవంతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ స్థానిక బాపూజీ నగర్‌లోని అవంతీ హెల్త్ క్లినిక్ అండ్ డయాగ్నోస్టిక్ సెంటర్లో ఉచిత ఈఎన్‌టీ వైద్య సేవలు అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.ఈ శిబిరంలో చెవి, ముక్కు, నాలుక వ్యాధులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. వినికిడి లోపం, చెవి నుంచి చీము కారడం, నొప్పి, పిల్లల్లో వినికిడి లోపం, తల తిరుగడం వంటి వ్యాధులకు వైద్యం చేస్తారన్నారు. థైరాయిడ్ గ్రంధి వాపు సమస్యలకు కూడా ఈ శిబిరంలో చికిత్స అందిస్తారని తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: చెట్లకొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల కోసం అనంతపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని టౌన్ , ఇండస్ట్రియల్ ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో నిడదవోలు డివిజన్ ఆపరేషన్ విభాగం ఈఈ బి.వీరభద్రరావు బుధవారం తెలిపారు. దాంతో అనంతపల్లి, కృష్ణమ్మగూడెం గ్రామాల్లో గృహ,వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ ఓటు కోసం 41 దరఖాస్తులు

తాళ్లపూడి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటర్లుగా నమోదు కోసం మండలవ్యాప్తంగా 41 దరఖాస్తులు వచ్చాయని, విచారణ అనంతరం వాటన్నింటినీ ఆమోదించామని తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం దరఖాస్తులను పరిశీంచారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వాటిని కాకినాడ కలెక్టరేట్‌కు తీసుకువెళతామన్నారు. ఈనెల 24 తర్వాత మళ్లీ క్లైయిములపై అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. కొత్తగా ఓటరు నమోదుకు మరొక అవకాశం వస్తుందన్నారు.

పారిశుధ్య కార్మికులను వెనక్కి రప్పించండి

కొవ్వూరు: విజయవాడ ముంపు ప్రాంతాల్లో విధులు నిర్వహించేందుకు వెళ్లిన 30 మంది కొవ్వూరు మున్సిపల్ పారిశుధ్య కార్మికులను రిలీవ్ చేసి తిరిగి కొవ్వూరు తీసుకుని రావాలని ఏపీ మునిసిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, సీఐటీయూ డిమాండ్ చేశాయి. ఈ రెండు సంఘాల నేతలు సంయుక్తంగా బుధవారం మునిసిపల్ మేనేజర్ రాధాకృష్ణకు వినతిపత్రం సమర్పించాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు మాట్లాడుతూ మూడు లేదా నాలుగు రోజుల పని అని చెప్పి తీసుకెళ్లి, తొమ్మిది రోజులు కావస్తున్నా సిబ్బందిని తిరిగి పంపలేదన్నారు. దాంతో కొవ్వూరు పట్టణంలో పారిశుధ్యం క్షీణిస్తోందన్నారు. సాధ్యమైనంత వెంటనే కార్మికులను వెనక్కు పంపకపోతే, కార్మికులే ఇంటికి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. విజయవాడలో కనీస సౌకర్యాలు కల్పించకుండా, రక్షణ సామగ్రి ఇవ్వకుండా పారిశుధ్య కార్మికులతో పనులు చేయించుకుంటున్నారని సుందర్ బాబు ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో కార్మిక సంఘ నాయకులు భూపతి రవీంద్ర, కళ్యాణ్ రాజేష్, కారంకి దుర్గా ప్రసాద్, చిట్టి రాజేంద్ర ఉన్నారు.

యర్రా కుటుంబానికి వేణు పరామర్శ


సత్యనారాయణ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న శశి విద్యాసంస్థల ఛైర్మన్ వేణుగోపాలకృష్ణ

నిడదవోలు రూరల్: మండలంలోని తాళ్లపాలెం గ్రామానికి చెందిన మాజీ మునసబు యర్రా సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ బుధవారం పరామర్శించారు. సత్యనారాయణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాళ్లపాలెం సర్పంచ్ యర్రా రామకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో లంకలు


పెరవలి మండలం కానూరు అగ్రహారంలో నీట మునిగిన వరి చేలు

- పెరవలి మండలంలోని 10 గ్రామాల లంకలూ వరదలోనే..
- పంటలన్నీ మునక
- దిక్కుతోచని రైతులు
- హడలిపోతున్న తీర ప్రాంత వాసులు

పెరవలి: గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో తీర ప్రాంత గ్రామాల ప్రజలు హడలి పోతున్నారు. మండలంలోని లంక భూములు మంగళవారం రాత్రికే ముంపు బారిన పడ్డాయి. బుధవారం తెల్లవారేసరికి గోదావరి నీటిమట్టం మరింతగా పెరగడంతో ఎగువ లంకల్లోని పంటలు కూడా నీట మునిగాయి. దాంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఆరుగాలం శ్రమించి పండిస్తున్న పంట కళ్లెదుటే నీటి పాలవడంతో వారు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వద్ద నుంచి మంగళవారం 13 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదలగా, బుధవారం 14.56 లక్షల క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. దాంతో మండలంలోని 10 గ్రామాల్లో విస్తరించి ఉన్న లంక భూముల్లో సాగవుతున్న పంటలు పూర్తిగా మునిగిపోయాయి. ముఖ్యంగా కూరగాయలు, కంద, పసుపు, అరటి తోటలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వరద వలన అరటి గెలలకు ఒంద్రు మట్టి పడుతుందని, మార్కెట్‌లో ధర లభించదని రైతులు చెబుతున్నారు. పూలతోటలు, ఆకుకూరలు, పచ్చిమిరప తోటలు నామరూపాలు లేకుండా పోతాయంటున్నారు. ఇక దొండ, బీర, ఆనప, పొట్ల పందిర్లు నీటిలో మునగడంతో నీరు తీసేసినా పాదులు చనిపోతాయని చెబుతున్నారు. తమలపాకుల తోటలు మొత్తం దెబ్బతినే అవకాశం ఉంది. ఎకరం విస్తీర్ణంలో తమలపాకుల పంట సాగు చేయాలంటే దాదాపు రూ.1.50 లక్షల వరకూ పెట్టుబడి అవుతుంది. లంకల్లో చేరిన వరద నీరు పూర్తిగా తొలగడానికి సుమారు వారం సమయం పడుతుంది. అప్పటికి పంటలన్నీ కుళ్లిపోతాయని రైతులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఇప్పటికే రెండు సార్లు గోదావరికి వరదలు వచ్చి రైతులను బాగా దెబ్బతీసిన విషయం తెలిసిందే.


గోదావరి వరదలో చిక్కుకున్న తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం లంక భూములు

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: మండలంలో బుధవారం గోదావరి ప్రవాహ ఉధృతి బాగా పెరిగింది. ఫలితంగా లంక భూముల్లోకి నీరు చేరుతోంది. తాడిపూడి ఎత్తిపోతల పథకం వద్ద, ప్రక్కిలంక ర్యాంపు వద్ద నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి భారీగా నీరు చేరుతుండడంతో గోదావరి వరద మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. పల్లపు లంక భూముల్లో సాగవుతున్న పలు రకాల పంటలు ఇప్పటికే ముంపుబారిన పడ్డాయి. వరద నీరు వేగేశ్వరపురం మేరీమాత ఆలయం మెట్ల వద్దకు చేరింది. తాళ్లపూడి, వేగేశ్వరపురం గ్రామాల గోదావరి లంక పంటల్లోకి నీరు చేరుతోంది.


ముక్కామలలో అరటి తోటలు ఇలా..


కానూరు-పెండ్యాల ర్యాంప్‌లో నీట మునిగిన షెడ్


తీపర్రులో నీట మునిగిన బొప్పాయి తోట

వరద ముంపులో గోష్పాద క్షేత్రం

- నిలిచిపోయిన ధూపదీప నైవేద్యాలు
- మద్దూరు హైస్కూల్లో 17 కుటుంబాలకు పునరావాసం
- కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- వినాయక విగ్రహాల నిమజ్జనాలకు బ్రేక్


మద్దూరు హైస్కూల్ పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రాన్ని గోదావరి పూర్తిగా ముంచెత్తింది. ఇక్కడి ఆలయాలన్నీ వరద ముంపులోనే ఉన్నాయి. ఆలయాల్లో బుధవారం ధూపదీప నైవేద్యాలు నిలిచి పోయాయి. ఈ క్షేత్రంలో మూడు అడుగులకు పైగా ఎత్తున వరద నీరు ప్రవహిస్తోంది.ఈ కారణంగా వినాయక నిమజ్జనాలకు సైతం ఆటంకం ఏర్పడింది. దీంతో పలువురు మంటపాల నిర్వాహకులు వినాయక నిమజ్జనాలను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. చిన్న విగ్రహాల నిమజ్జనాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నామని పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. ఏదైనా పెద్ద విగ్రహం ఉంటే సమీపంలోని కాలువ, చెరువు వద్ద నిమజ్జనం చేసుకోవాలని సూచిస్తున్నామన్నారు. దొమ్మేరు గ్రామంలో ప్రతిష్ఠించిన విగ్రహాన్ని కాపవరం సమీపంలోని వాగులో నిమజ్జనం చేయాలని సూచించామన్నారు.

పునరావాస కాలనీకి మత్స్యకార కుటుంబాలు

మద్దూరులంక గ్రామంలో గోదావరి నది వైపు నివాసం ఉంటున్న పల్లెపాలెంలోని 17 కుటుంబాలకు చెందిన 49 మంది మత్స్యకారులను మద్దూరు హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఈ పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. బాధితులతో మాట్లాడారు. వారికి అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. కొవ్వూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.అజయ్‌బాబు, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు. మరోవైపు రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి గోదావరి నది ప్రవహిస్తోంది. బుధవారం సాయంత్రం ఐదు గంటలకు ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నీటిమట్టం 15 అడుగులకు చేరింది. బుధవారం తెల్లవారుజాము ఐదు గంటలకు నీటిమట్టం 13.75 అడుగుల దాటడంతో జలవనరుల శాఖ అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గురువారం కూడా వరద ఉధృతి కొనసాగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆనకట్ట వద్ద నుంచి 14,70,958 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. అధికారులు 11వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ఇసుక ర్యాంపులను తెరవాలని భావించారు. వరద తీవ్రత దృష్ట్యా మరో వారం రోజుల వరకూ ర్యాంపులు తెరుచుకునే పరిస్థితులు కనిపించడం లేదు. నదీ పరీవాహక ప్రాంతంలో ప్రస్తుతం ఏవిధమైన వర్షాలు కురవకుంటే శుక్రవారం సాయంత్రానికి వరద సాధారణ స్థాయికి చేరే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.


గోదావరి వరద ముంపులో కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోని ఆలయాలు

రేపు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 13న స్థానిక ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ ఎం.తిరుమలదాస్ బుధవారం తెలిపారు. అండర్ -14, అండర్- 17 విభాగాల్లో బాల బాలికలకు మండలస్థాయిలో ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. మండలస్థాయిలో ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. చెస్, యోగా, షటిల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. అండర్ -14 విభాగంలో పాల్గొనే వారు జనవరి-1, 2011 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఆరు నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు మాత్రమే అండర్- 17 విభాగంలో పాల్గొనేందుకు అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం 98666 65207 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

13,17 తేదీల్లో తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: ఉత్తమ క్రీడాకారుల ఎంపికకు ఈ నెల 13, 17 తేదీల్లో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో సీహెచ్ బాలామణి తెలిపారు. మండలంలోని గజ్జరం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్ పోటీలను అండర్ -14, అండర్- 17 విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలకు సన్నాహకాలపై బుధవారం వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద మండలంలోని వ్యాయామోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అందరూ ఈ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంఈఓ బాలామణి సూచించారు. సమావేశంలో ఎఈవో-1 సీహెచ్ నెహ్రూజీ, కో-ఆర్డినేటర్ ఎ.విజయకుమార్, వ్యాయామో పాధ్యాయులు వెంకటేశ్వరరావు, రామచల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా చెట్ల నరికివేతపై ఫిర్యాదు


రాంపాలెం వద్ద పోలవరం కుడి ప్రధాన కాలువ గట్టుపై చెట్టు నరుకుతున్న కూలీలు


కట్టెలు

అధికార పార్టీ నేతల నిర్వాకంపై ఎంపీటీసీ మాజీ సభ్యుడి నిలదీత

గోపాలపురం: గంగోలు పంచాయతీ పరిధిలోని రాంపాలెం వద్ద పోలవరం కుడి ప్రధాన కాలువ గట్టుపై గల చెట్లను అధికార పార్టీ నాయకులు అక్రమంగా నరికించి, సొమ్ము చేసుకుంటున్నారని గంగోలు ఎంపీటీసీ మాజీ సభ్యుడు మందపాటి శ్రీను ఆరోపించారు. ఇక్కడున్న విలువైన చెట్లను రెండు రోజులుగా నరికేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోలేదని ఎంపీటీసీ సభ్యుడు శ్రీను బుధవారం విలేకరులకు తెలిపారు. వర్జీనియా పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉండడంతో వాటికి అవసరమైన కట్టెలకు డిమాండ్ ఉండడంతో అధికార పార్టీ నాయకుల దృష్టి ఇక్కడున్న చెట్లపై పడిందని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెట్లను అక్రమంగా చెట్లను తొలగిస్తున్న వారిపై చర్యలు తీసుకొని, కాలువ గట్టు పటిష్టతను కాపాడాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోరారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత

నల్లజర్ల: దూబచర్ల జెడ్పీ హైస్కూల్‌కు అదే పాఠశాల పూర్వ విద్యార్థి, జనసేన నాయకుడు సత్యనారాయణ మిత్ర బృందం బుధవారం రూ.10 వేల విలువైన క్రీడా సామగ్రిని హెచ్‌ఎం సుమతికి అందజేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సమకూర్చిన ఈ క్రీడా సామగ్రిలో క్రికెట్ కిట్, వాలీబాల్ కిట్, ఖోఖో పోల్స్, షటిల్ బ్యాట్లు ఉన్నాయి. ఎంపీటీసీ సభ్యుడు ఈడే శ్రీనివాసరావు, మానూరి నారాయణ, పూరెల్ల సత్యనారాయణ, అప్పసాని రాంబాబు, శివకాల సురేష్, వ్యాయామోపాధ్యాయుడు దూబగుంట్ల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లను పరిశుభ్రంగా ఉంచాలి


ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు


దేవరపల్లి: పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నందున విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్నభోజన పథకాన్ని దగ్గరుండి సమీక్షించాలని ఆయన ఆదేశించారు. భోజనశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే విద్యార్థులకు ఇవ్వాలన్నారు. ప్రతి పాఠశాలకూ డస్ట్ బిన్లను మండల పరిషత్ ద్వారా అందజేసినట్టు ఎంపీపీ తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ పి.ప్రభాకరరావు, ఎంఈఓలు ఎం.తిరుమలదాస్, కేఆర్ ఎస్‌వీవీ అప్పారావు, మండలంలోని 45 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాల్గొన్నారు.

నడుపల్లిలో దుర్వాసనపై అధికారుల విచారణ


కోళ్ల రైతులు, ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అధికారుల బృందం

పెరవలి: జనావాసాల మధ్య నిర్వహిస్తున్న కోళ్ల ఫారాల నుంచి వస్తున్న దుర్గంధాన్ని భరించలేకపోతున్నామంటూ మండలంలోని నడుపల్లి గ్రామస్తులు ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం రెవెన్యూ, పంచాయతీ, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఆ గ్రామాన్ని సందర్శించారు. ఫిర్యాదుదారులు చెప్పిన విషయాలను అధికారుల బృందం నమోదు చేసుకుంది. కోళ్ల ఫారాల నుంచి వచ్చే వ్యర్థాలు, తీవ్ర దుర్గంధం వల్ల తాము అనారోగ్యం పాలవుతున్నామని, చర్మవ్యాధులు వస్తున్నాయంటూ అక్కడి నివాసితులు అధికారులకు నివేదించారు. వాటి బారి నుంచి తమకు రక్షణ కల్పించాలని వారు వేడుకున్నారు. అనంతరం అధికారుల బృందం సమస్యకు కారణమైన కోళ్ల ఫారాలను పరిశీలించారు. వాటి నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించలేని అధికారులు అర్జెంట్‌గా మాస్కులు తెప్పించుకుని ధరించారు. సమస్య తీవ్రతను గుర్తించిన అధికారులు కోళ్ల ఫారాల యజమానులను గట్టిగా నిలదీశారు. ఇంతటి దుర్గంధం వస్తుంటే చుట్టుపక్క వారు ఎలా నివాసం ఉండాలి? అంటూ ప్రశ్నించారు. వర్షాల వలన మురుగు నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన వస్తోందని కోళ్లఫారాల రైతులు సంజాయిషీ ఇచ్చారు. వర్షాలు తగ్గిన వెంటనే డ్రైన్ నిర్మించి దుర్వాసన రాకుండా చూస్తామని బదులిచ్చారు. సమస్యకు తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని అధికారులు వారిని హెచ్చరించారు. అనంతరం ఎవరికీ చెప్పకుండా అధికారుల బృందం సైలెంట్‌గా వెళ్లిపోయింది. దీంతో బాధితులు విస్తుపోయారు. ఎందుకు వచ్చారు? ఏమీ సమాధానం చెప్పకుండా వెళ్లడం ఏమిటంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల బృందంలో కాలుష్య నియంత్రణ మండలి జిల్లా అధికారి సందీప్‌రెడ్డి, తహసీల్దార్ డి.అచ్యుత కుమారి, ఆర్ఐ పావని, స్థానిక రెవెన్యూ, పంచాయతీ అధికారులు కూడా ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆందోళన


నల్లజర్లలో ఆందోళన చేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కార్యాచరణ సమితి సభ్యులు

నల్లజర్ల: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఐక్య కార్యాచరణ సమితి నల్లజర్ల మండల శాఖ సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని మాల మహానాడు, దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నల్లజర్లలో నిరసన తెలిపారు. చెక్ పోస్టు సెంటర్ నుంచి ప్రధాన వీధుల మీదుగా ప్రదర్శన చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో వారంతా మానవహారంగా ఏర్పడ్డారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత తహసీల్దార్ కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టికల్ 341ను సవరించకుండా ఎస్సీల్లో కులాలను కలపడం గాని తొలగించడం గాని కుదరదన్నారు. వివిధ గ్రామాల నుంచి దాదాపు 600 మంది నిరసనలో పాల్గొన్నారు. గుదే వెంకట సుబ్బారావు, పిల్లి కాంతారావు, తోట వెంకట్రావు, గొటుకుల కృష్ణ, చోడవరపు అప్పన్న, ములగాల గోపి, బంటుమిల్లి వెంకటేశ్వరరావు తదితరులు కార్యక్రమానికి సారథ్యం వహించారు.

సుప్రీం కోర్టు తీర్పును పునః పరిశీలించాలి

కొవ్వూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా కొవ్వూరు మాలమహాసభ, మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక క్రిస్టియన్‌పేట అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన తెలిపారు. తన తీర్పును సుప్రీం కోర్టు పునః పరిశీలించాలని మాల మహాసభ జాతీయ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బొంతా శ్యాం ప్రకాష్ డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పలువురు ఎంపీలు, కేంద్ర మంత్రులు చేపట్టిన నిరసనకు మద్దతుగా తామీ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు మాసా ఆనంద్, ఎం.బంగార్రాజు, సాకా పుల్లారావు, పీతల చింటూ, పురుషోత్తం చిన్నా, శీలి అజయ్, బొందల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

దందాకు పాల్పడిన రిపోర్టర్‌పై కేసు

నల్లజర్ల: విజయవాడలోని గొల్లపూడి ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి బుధవారం ఉదయం 7 లారీల్లో బియ్యం, ఉల్లిపాయలు, నూనె, బంగాళాదుంపలు తదితర వస్తువులు తీసుకొని పిఠాపురం బయలుదేరాయి. వాటికి అమలాపురం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జి.వెంకట ప్రసాద్ ఎస్కార్ట్‌గా వెంట ఉన్నారు. ఈ లారీలు నల్లజర్ల శివారుకు వచ్చేసరికి ముగ్గురు వ్యక్తులు మేం రిపోర్టర్లం అంటూ పల్సర్ బైక్‌పై వచ్చి ఆఖరి లారీని ఆపారు. సరుకులకు బిల్లులు చూపాలంటూ హడావుడి చేశారు. బిల్లులు లేకుంటే దొంగ సరుకని తమ చానల్‌లో ప్రసారం చేస్తామంటూ సొమ్ము డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వచ్చి అందులో ఒకరిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. వెంకట ప్రసాద్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరిబాబు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తి దెందులూరుకు చెందిన వన్ టీవీ స్టాఫ్ రిపోర్టర్ గుంపుల విక్టర్ అని ఎస్సై తెలిపారు.

స్కూల్ ఆవరణలో మద్యం విక్రయాలు ఆపాలి

బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గెల్లా శ్రీనుబాబు

గోపాలపురం: మండలంలోని గుడ్డిగూడెం ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో సాగుతున్న మద్యం విక్రయాలను నిలుపుదల చేయించాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గెల్లా శ్రీనుబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని టీడీపీ ఎంపీటీసీ సభ్యుడి బంధువు ఒకరు ఈ పాఠశాల ఆవరణలో సారా, మద్యం విక్రయాలు సాగిస్తున్నారని ఆరోపించారు. పాఠశాల ప్రహరీపై కూర్చుని మద్యం విచ్చలవిడిగా తాగుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి చెందిన వ్యక్తులే ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించడం దారుణమని శ్రీనుబాబు అన్నారు. సారా, మద్యం విక్రయాల విషయంలో గుడ్డిగూడెం ఎంపీటీసీ సభ్యునికి మండల నాయకుల తోడ్పాటు అందించడం సిగ్గుచేటన్నారు. కాగా మండలంలో ఇటీవల ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు పెరిగిపోయాయని ఆయన ఆరోపించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొవ్వూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకురాలి పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మీ బుధవారం తెలిపారు. కొవ్వూరు మండలంలో ఆరు, తాళ్లపూడి మండలంలో ఒకటి, చాగల్లు మండలంలో ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కనీసం పదో తరగతి పాసైన స్థానికులైన వివాహిత మహిళలే దరఖాస్తు చేసేందుకు అర్హులన్నారు. ఈనెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకూ తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గడువు ముగిసిన తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిశీలించబోమన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.